AOVA1033135

# సాధనానుభూతి శరణుశర్మ

ద్వితీయ శతము

రచయిత :

చిట్టూరి లక్ష్మీనారాయణ శర్మ

సాహిత్య సౌరభకుటి

6-3-354/10, హిందీ నగరం,

హైదరాబాద్-500034.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
11027

కృతిపతి

కవిసామ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

ప్రచురణ కర్త

మాతృ ప్రీత్యర్థమ్

శ్రీ మల్లికార్జున వరప్రసాదరావు ఆలూరి

H 601-10, బంజారీహిల్స్, హైదరాబాదు-034.

# విషయ శీర్షికలు


| | | | పుట సంఖ్య |
|---|---|---|---|
| 1. | స్మరణ | .... | iii |
| 2. | ప్రార్థన | .... | iv |
| 3. | ఆత్మగతము | .... | 1 |
| 4. | ఆహార-విహారము | .... | 4 |
| 5. | ఆశ్రమ-ధర్మము | .... | 5 |
| 6. | సేవా-సాధనము | .... | 6 |
| 7. | తర్క-బుద్ధి | .... | 13 |
| 8. | న్యాయ-బుద్ధి | .... | 16 |
| 9. | వివేక-బుద్ధి | .... | 18 |
| 10. | ముగింపు | .... | 21 |
| 12. | శబ్దార్థములు | .... | 22 |


....:—:....

181.4 LAX

# స్మరణ

పరమ భాగవతులు ప్రహ్లాద నారద
స్మరణ భజన జ్యోతి దరికి జేర్చు
రామ నామము పరధాములోనే గల్పు
సాధనానుభూతి శరణు శర్మ!

అంజనీ సుతుండు నా దర్శమగు బంటు
దాశరథియు పరమ ధర్మరాజు
ప్రజల నూరడింప ప్రభువును సేవింప
సాధనానుభూతి శరణు శర్మ!

తనను తానె స్మరణ తగుదుననుచు చేయు
తాన తందనాన తద్దిగిణత
ఆతడామె యొకటె అర్ధనారీశుడు
సాధనానుభూతి శరణు శర్మ!

# ప్రార్థన

వ్యాసులంత వేద వ్యాఖ్యలు వ్రాసిరి
అందు నీ వొకడవు సందియంబె
రామ కావ్య స్రష్ట స్వామి వాల్మీకివె
విశ్వనాథసుకవి విశ్వనాథ!

నవ్య పూర్వ కృతుల భవ్యకవుల దివ్య
భావ సాహితి కిల భాస్కరుడవు
కవి వరేణ్య రమ్యకళల కాట పట్టు!
విశ్వసుకవినాథ విశ్వనాథ!

విశ్వనాథ, నాదు శాశ్వత సచ్చిదా
నంద దాయి మిత్ర నమ్మిన గురు!
అందుకొనుము కృతిని ఆశీర్వదింపుము
విశ్వసుకవినాథ విశ్వనాథ!

౨౧

# ఆత్మగతము

ఆ. వె॥ ఆత్మయందు నిండె నఖిల భూతంబులు
అఖిల భూతములను నాత్మ నిండె
తెలిసి యన్నియందు మెలగు మోహము వీడి
సాధనాభూతి శరణు శర్మ!

మనసు తిరుగునతిగ మహి చక్రగతి సదా
యోగి వగుచు దాని లాగిపట్టి
నిలుపు చిత్తము హరి గలుపు లీన స్థితి
సాధనానుభూతి శరణు శర్మ!

ఆత్మయనగ నీవె ఆత్మ స్వయంభువు
ఆత్మయును మరి పరమాత్మ నీవె
అంతరంగమందు ఆశ్చర్య మొందకు?
సాధనానుభూతి శరణు శర్మ!

మనసు గలదు గాన మానవుడన్నారు
మనసు అనగనేమొ మది నెఱుంగు
జ్ఞాన హేతువైన చైతన్యము మనస్సు
సాధనానుభూతి శరణు శర్మ!

మనసు అనగ నీవు మనసు అనగ నేను
మనసు ఆత్మ ప్రకృతి మనసు బుద్ధి
వేదనాదులును వివేచనా మిళితమే
సాధనానుభూతి శరణు శర్మ!

ఆ.వె॥ మానవతయె జగతి మంచి దంద్రుడు బుధులు
కాని దాని క్రమము గతి నెఱింగి
సర్వ మనుజులందు సమభావ ముంచుకొ
సాధనానుభూతి శరణు శర్మ!

వచ్చు నప్పుడేమి తెచ్చునదియు లేదు
పోవునపుడు రాదు పుల్లయైన
ముక్తి నొంద కర్మభక్తి జ్ఞానమె మూడు
సాధనానుభూతి శరణు శర్మ!

తపమునిష్ఠతోడ తనువు మనంబున
వేదనయును మరి వివేచనయును
మిళితమగుచు వెదకి మీది బాటను బడు
సాధనానుభూతి శరణు శర్మ!

సంయమ మవసరము సంసార యాత్రలో
రక్తి సక్తి అతిగ యుక్తి తగదు
అహితము సమకూర్చు అతిభ్రాంతి యన్నిట
సాధనానుభూతి శరణు శర్మ!

మేలుకొనుము నిద్ర నాల్గవ జామున
స్నాత శౌచవిధి పవిత్ర మగుకొ
ప్రాణయామి వగుము జ్ఞానదీక్ష వహించి
సాధనానుభూతి శరణు శర్మ।

ఆ.వె॥ కో౽హమనుచు పిల్చి సో౽హమ్మనుచు దాల్చి
నా అహమ్ము వదలు నాశికమున
భావ యుక్త మనిల- సేవనమే సాధు!
సాధనానుభూతి శరణు శర్మ!

చూపు నిల్పు బుద్ధి చెదర నీ కటు నిటు
నిత్య మొక్క కాల నియతి నిష్ఠ
పూర కుంభ రేచములు నివి యోగము
సాధనానుభూతి శరణు శర్మ!

జ్ఞాన ప్రాణయామ మూని మైమనసున
కనుల సూక్ష్మదృష్టి కాంతి నిండి
ఆత్మలీల మౌన అభ్యసించును పెంచు
సాధనానుభూతి శరణు శర్మ!

కర్మభక్తి జ్ఞాన మర్మ మేదో కాదు
సహజగుణము మూడు సాధనములె
క్రమము మూడవ తరగతి యె జ్ఞానమ్మగు
సాధనానుభూతి శరణు శర్మ!

కర్మ భక్తి జ్ఞానమర్మమె నిస్వార్థ
నిష్ఠతోడి కర్మ నిఖిల మనుము
భక్తి జ్ఞానమందె రక్తితో నిమిడెను
సాధనానుభూతి శరణు శర్మ!

## ఆహార–విహారము

ఆ.వె॥ మనసునకును నెపుడు మలిన మంట నీకు
తిండియందె నల్లె తెలిసి కొనుము
అన్నమందు మితి విహార వివేకము
సాధనానుభూతి శరణుశర్మ !

॥పప్పుదుంపలధిక మొప్పవు మిరియమే
మంచిచేయు కారముగ గ్రహించు
పెరుగుతోటకూర మెరుగు ఆకులలోన
సాధనానుభూతి శరణు శర్మ!

॥ఆకలయిన యెడల నాహారము కొలత
కల్లు నీరు దినము నాల్గుశేర్లు
మట్టికుండలోనిది మరి యాకు కూరయు
సాధనానుభూతి శరణు శర్మ!

॥మంచిగాలి పీల్చు మంచి నీరుత్రాగు
చల్లనీటి యందు స్నానమాడు
పులుసు కారముప్పు తలచబోకు మతిగ
సాధనానుభూతి శరణు శర్మ!

॥సకలవైద్యమ్ములు సరిచేయు రోగముల్
నోట మందువేయ పాటుపడును
ప్రకృతి వైద్యమొకటె పాలించు నాహార
మితము హితము ప్రకృతి గతియె శర్మ!

ఆ.వె॥ రోగమంటనీకు బాగుగా వర్తించు
అంటరాదు నీవు నాజ్ఞపెట్ట
తెలిసి తినుము తిరుగు మలవాటులే మందు॥
సాధనానుభూతి శరణుశర్మ!

॥సాధ్యయోగి యగును సాధనమ్ములచేత
సత్వబుద్ధికన్ని సాధ్యమగును
తెలిసి తినుము తిరుగు మలవాటు యోగమె!
సాధనానుభూతి శరణుశర్మ॥

॥సరియదైన తిండి సత్వము సమకూర్చు
శాంతి సుఖములిచ్చు భ్రాంతి ద్రుంచు
కూడనట్టి తిండి కూర్చు రజస్సును
సాధనానుభూతి శరణు శర్మ!

## ఆశ్రమ-ధర్మము

॥బంటు నంచునెంచి పాలించు ధర్మమ్ము
ధర్మపత్ని పుత్రు దరిని జేర్చు
రాజయోగికిని విరక్తి రక్తిసమమె
సాధనానుభూతి శరణుశర్మ!

ఘనుడవగుము ఈశుగనుము అన్నిటి, నిజ
కులము స్థలము స్థిరత బలము నదియె
తోడబుట్టు ప్రాణి తోడుగా నుండుము
సాధనానుభూతి శరణుశర్మ!

ఆ.వె॥ఏది ఆశ్రమమ్ము నీది ఏకాంతమె
నిత్యకృత్యములును నియతి నిష్ఠ
సాగిపోసదా సుసాధుసజ్జనులతో
సాధనానుభూతి శరణుశర్మ!

భార్యసుతుల కలియు భావమ్మెగుర్పింప
ఆశ్రమమ్మె లక్ష్యమై వెలుంగ
నిగిడి సత్వగుణమె నిఖిల తమోహారి
సాధనానుభూతి శరణుశర్మ!

॥నీదు లోపములను నీలోన చూడుము
మాపయత్నపడుము మాన్యచరిత!
దీప్తి నీది యెంత దివ్యమై వెలుగునో!
సాధనానుభూతి శరణుశర్మ!

## సేవా-సాధనము

దేవుడనగ నీవె నీవె దేవుడవును
కావ జనగదయ్యా కరుణ ప్రజల
పేదలకును గొప్ప పెన్నిధివై నీవు
సాధనానుభూతి శరణు శర్మ!

రాజు ఋషియు రాజరాజు మహాఋషుల్
భూమి దున్ని గింజ పొందినారు
జనక దుహిత ఫలము జానకి నాగలి
సాధనానుభూతి శరణు శర్మ!

ఆ. వె॥ చీపురొకటి తట్ట చేతను పట్టిన
మలిన మంత మట్టి కలిసిపోయి
పొలముదున్ని నాటి కలుపుదీయుము పెంచు
సాధనానుభూతి శరణుశర్మ!

కోసి కొడవలిగొని కుప్పవేసియు నూర్చి
ధాన్యమింటకొన్ని దాచిపెట్టి
పురిని కట్టివేయు తరువాత తిండికి
సాధనానుభూతి శరణుశర్మ!

కొక్కురోకొ! యనుచు కోడి కూయగానె
లెమ్ము పశులవెంట పొమ్ము పొలము
జాముప్రొద్దుదాటి చలిది మూటను విప్పు
సాధనానుభూతి శరణుశర్మ!

బ్రహ్మ రాజవైశ్య బహువిధ జాతులు
మానసమును బుట్టుగా ననేక
జాతి మనుజజాతి ప్రీతి దయా కృతి
సాధనానుభూతి శరణుశర్మ!

బ్రతుకుటకొక కర్మ నతికి యుండును జీవి
జాతి వృత్తి పనులచేత పెరిగి
కమ్మ కాపు కులము కర్మ కృషీవలుల్
సాధనానుభూతి శరణుశర్మ!

ఆ. వె॥ కూడు నిట్లు కృషిని కూడబెట్టగ సాగె
కట్టుబట్ట నేత కదురు కండె
పడుగు పేక ప్రత్తి తోడి శాలి కర్మయు
సాధనానుభూతి శరణుశర్మ!

పంటనేత కర్మ ఫలితమె మనుగడ
చదువు వృత్తి బుద్ధి చక్కబరచు
ఇతర కృతులనేక గతుల వెల్గొందెను
సాధనానుభూతి శరణు శర్మ!

అంటు ముట్టు భేద మరసి నీవెచూడు
మాలలనుట బుద్ధి మలినమె కద!
బుద్ధి శుద్ధిచేసి శుద్ధి పరచు పల్లె
సాధనానుభూతి శరణుశర్మ!

జ్ఞాని బ్రహ్మయనిరి జ్ఞానహీనుని మాల
గుణమె కులము వన్నెగురువుకాదె!
మనుజ జాతి పనియె ఒనగూర్చె జాతుల
సాధనానుభూతి శరణు శర్మ!

సంఘదుర్గతులను సంస్కరింప దలంచి
తెలిసి కొంటివిగద! తెలివితేట
లనెడివే కులములు హైన్యఘనతలవియె
సాధనానుభూతి శరణు శర్మ!

ఆ. వె॥ హీనుడనుట యొకని హీనుడవైనట్టె
చెడ్డబుద్ధియె కద। చెడ్డ చూచు!
వెస బవిత్రత కపవిత్రత కెటపొత్తు?
సాధనానుభూతి శరణు శర్మ!

ముండ్లుగల గులాబి ముదమిచ్చు పూలిచ్చు
జాజిమల్లె సన్నజాజి యల్లె
చెడ్డ మంచి ఒక్క చేర్పనే గన్పించు
సాధనానుభూతి శరణుశర్మ!

మంచి చెడ్డ కలసి మానవుడగుగాన
మంచి నుంచి చెడ్డ ముంచివెయ్యి
సహనశక్తి గొప్ప సంపద గడియించు
సాధనానుభూతి శరణు శర్మ!

మంచి యెచట నున్న నెంచి తీసికొనుము
చెడ్డదరికి దృష్టి చేరనీకు
పరమపావనుడవు పురుషోత్తముడవగు
సాధనానుభూతి శరణు శర్మ!

అద్దమ మలినమ్మునది ప్రతిబింబించు
స్పష్టమైనయట్లు శిష్టమతికి
మనుజులందు మంచితనమె గన్పించును
సాధనానుభూతి శరణు శర్మ!

ఆ. వె॥ మంచి పనులుచేసి కొంచమో గొప్పయో
అనుభవమును పొంది అపుడు చెపుమ
మంచిచేసి చెప్ప మానవ మర్యాద
సాధనానుభూతి శరణు శర్మ!

చెట్టు కాయఫలము కట్టె ఆకులనిచ్చి
సేవచేయుచుండు భావమున్న
మానవుడవు నీవు మనవచ్చునా వృధా!
సాధనానుభూతి శరణు శర్మ!

ఆవుపాలనిచ్చి 'అవు' ననిపించదే
పూవు గంధమిచ్చి పూజలందు
చేయగలిగినంత చేసి చేతులనెత్తు
సాధనానుభూతి శరణు శర్మ!

తనది పెఱది మరియు తనదియు పెఱదియు
ఇందు రెండవదియు యెక్కువయది
గాంధి చెప్పినట్టి కరుదును నమ్మును
సాధనానుభూతి శరణు శర్మ!

సత్త సత్తు రెండు సహజమ్ములగు నీకు
విశ్వ జీవితమును విడువలేవు
ముడిని పెట్టినావు దృఢ జీవితము తోడ
సాధనానుభూతి శరణు శర్మ!

ఆ. వె॥ మానవాళిసేవ మాధవ సేవని
ఎఱిఁగి ముందు వెనుకలరయ నేల?
ముందుకరిగి సేవయందె జీవితమిడు
సాధనానుభూతి శరణు శర్మ!

స్వార్థము సహజమ్ము స్వార్థరాహిత్యమ్ము
సహజ మట్టి బుద్ధి సవధరింపు
బోధపడును నీకె సాధకుడగుదువు
సాధనానుభూతి శరణు శర్మ!

కనుల ముందు నీకు కనుపించు లోకము
చిత్ర చిత్రమగు విశేషప్రాణి
అందు నీవొకడవనుభూతి హృదయివి
సాధనానుభూతి శరణు శర్మ!

వేదనా వివేచనాది ప్రేరణయిది
మనసును పురికొల్పు మార్గమిచ్చు
వేదన కద! సృష్టి వెదకును స్రష్టను
సాధనానుభూతి శరణు శర్మ!

వెస విచక్షణయు వివేచనా జ్ఞానమ్ము
బుద్ధి నిలిపి ఈశు బొంద వచ్చు
అద్ది, లేని యెడల అణగి పోవలయును
సాధనానుభూతి శరణు శర్మ!

ఆ. వె॥ చేష్టలెన్నియైన చేయించు ప్రేరణ
జ్ఞాన దృష్టి బరపి లీనమగుము
ఈశ్వరాంశ నిన్ను శాశ్వతమై పొందె
సాధనానుభూతి శరణు శర్మ!

వేదనా వివేచనాది ప్రేరణములు
మూడు, మనసుచెంది గూడు కట్టి
ఉన్నవానియొక్క ఉపయోగ మెఱుఁగుము
సాధనానుభూతి శరణు శర్మ!

స్థూల దృష్టిగాక సూక్ష్మదృష్టిని జూడ
మూల పురుషుఁడపుడె మ్రోలనిలుచు
సాధనమ్మున అతని సాధించ వచ్చును
సాధనానుభూతి శరణు శర్మ!

కనులకు గనుపించు జన జంతు ప్రాణుల
సృజనసేసెనెవడొ సృష్టి కర్త
చూడవలయునతని చూడగా కోరుట
సాధనానుభూతి శరణు శర్మ!

ఆది మొదలు చివర ఆకార నామముల్
లేవనంత మహిమ లీనుడగుట
వానినొకవెు చేరు బాట విశ్వాసము!
సాధనానుభూతి శరణు శర్మ!

ఆ. వె॥ ఆంతరంగికమగు అనుభూతి విశ్వాస
మణువుల మిళితమను తనువు, లేక
సృష్టి కర్త వలన సృష్టింపబడెనను
సాధనానుభూతి శరణు శర్మ!

## తర్క-బుద్ధి

సత్యమొకటి నమ్ము సర్వజ్ఞుడవు గమ్ము
సాధనమున అంత సంతరించు
సకల లోకములను సర్వంబు నీయూహ
సాధనానుభూతి శరణు శర్మ!

పుట్టినాది నుండి పుడమిలో వెదకుచు
తాను వేరు కాదు తనువు ప్రకృతి
సత్యమే నిజంబు సకల మనిత్యము
సాధనానుభూతి శరణు శర్మ !

స్వానుభూతి నీకు ఆనందమయదీప్తి
మార్గ దర్శకంబు మనన నియమ
జ్ఞాన దివ్య సుప్తి పూనింప వెన్నంటు
సాధనానుభూతి శరణు శర్మ!

వేదముపనిషత్తు బోధించు తత్త్వము
ఋషుల తన్మయతలె హృషిత-రవమె
వాడె నీవు నీవెవాడను మాటయే
సాధనానుభూతి శరణుశర్మ

చదువులేల శాస్త్రచర్చలేల? తగవు
గురువనంగ జ్ఞాన గురువె గురువు
జ్ఞాన సాధనమున స్థానంబు చేరుము
సాధనానుభూతి శరణుశర్మ!

అస్తి నాస్తి రెంట నస్తియున్నది గద!
అస్తి నాస్తి భేదమలరెశబ్ద
మందు, భావ భేద మెందు గన్పించదు
సాధనానుభూతి శరణుశర్మ

ప్రథముడలరు స్నేహాభక్తి నాస్తికుడును
శూలదృష్టితోడ చొచ్చిచూచు
అన్నధమ్ముౕలె కద! ఆస్తిక నాస్తికుల్
సాధనానుభూతి శరణు శర్మ!

చతురతకును నిపుణ చాతుర్యములకేమి
తర్కబుద్ధిగనునె? తత్త్వబోధ!
శుద్ధమైనబుద్ధి చూపునేమో దాని
సాధనానుభూతి శరణు శర్మ!

లోకమందు తెలివిలోతు తెలుంగుట
న్యాయశాస్త్ర తర్కమరసి కనుట
బుద్ధిబలము జ్ఞానశుద్ధి పైడికితావి
సాధనానుభూతి శరణు శర్మ!

ప్రజల మెప్పుకొనుట ప్రథమ కర్తవ్యము
తగిన కోర్కెయైన తగవులేదు
తర్కబుద్ధి యిట్టి తగవు తీర్చనులేదు
సాధనానుభూతి శరణు శర్మ

పురుషోత్తముఁడని పుణ్యపూరుషుఁడని
ఉత్తమోత్తముఁడని యుర్వియందు
ప్రథను పొందువాడు పరమాత్మ కావచ్చు
సాధనానుభూతి శరణు శర్మ!

ఎవరు నేమియనిన అవధాన బుద్ధితో
వినుట, లోని తగవు గనుట బాగె!
కాని, తర్కబుద్ధి కాంచునే నిజమును?
సాధనానుభూతి శరణు శర్మ!

బుద్ధి వికసనమును వృద్ధి పొందింపను
గ్రంథపఠన స్వాంతగమ్యస్థిరత
నవధరింతువేని జ్ఞాన వికాసమౌ
సాధనానుభూతి శరణు శర్మ!

సరస సుజన గోష్ఠి సాహిత్య గోష్ఠియు
ఇంటబైట విధిగనుంట మేలు
పరవశత్వ రసము పానమొనర్చుము
సాధనానుభూతి శరణు శర్మ!

తెలియనట్టిదాని తెలిసి కొనుచుండుము
తెలియనట్టిదాని తెలిసినట్లు
అభినయించబోకు మభ్యాసమే మేలు
సాధనానుభూతి శరణు శర్మ!

నేర్చుకొన్న విద్య నేర్పుట ధర్మము
ఇరువురకును మేలె! ఇచ్చు పుచ్చు
కొనుట భావవృద్ధి మననాభి వృద్ధియు
సాధనానుభూతి శరణు శర్మ!

## న్యాయ-బుద్ధి

తల్లి దండ్రి గురువు దైవము మిత్రుడు
బంధుగులను నుండి పొందుజ్ఞాన
శక్తుల వినియోగ సరణిలో నుంచుము
సాధనానుభూతి శరణు శర్మ!

సంపదను వ్యయించు మింపు పాత్రోచిత
విధిని పేదప్రజల బీదలందు
నాదరింపవలయు నా ధర్మమేయని
సాధనానుభూతి శరణు శర్మ!

కరుణ హృదయమెల్ల కరగింప పల్లెల
పేదజనులకీవు పెన్నిధివయి
చదువు బ్రతుకు- తెరువు సలిపి ఆహ్లాదించు
సాధనానుభూతి శరణు శర్మ!

మోదమనగ నేమొ బోధపడుంజుమీ
చేసి చూడు! నేను చేసి నీకు
చెప్పు హితవు, బాపు చేసి చెప్పిన దిదె!
సాధనానుభూతి శరణు శర్మ!

మొక్కలందు గడ్డి చెక్కి నీరుం బోయ
పూవు కాయ నిచ్చు సేవ-ఫలము
తాను పెరిగి, నిన్ను తనను మించగ పెంచు
సాధనానుభూతి శరణు శర్మ!

సేవచేయ శాంతి భావ సంపదయని
సోదర జనుల సమాదరించు
ఒగి శరీరమిది పరోపకారరార్ధమ్మ
సాధనానుభూతి శరణు శర్మ!

చావు పుట్టుకలును జరుగుచు నుండును
కష్ట సుఖములల్లె కలుగుచుండు
సంతసమ్మ దుఃఖ సంతానమున నల్లె
సాధనానుభూతి శరణు శర్మ!

నిండియుండు కడలి, ఉండు హద్దుల లోనె
కామక్రోధములును కదలకుండు
నే మహాత్ముఁనందొ స్వామి యాతడొకడె
సాధనానుభూతి శరణు శర్మ!

విషయ వాంఛ వలన విషయ బుద్ధి జనించు
పుట్టు దానక్రోధ మోహములును
మోహ హేతుకముగ బుద్ధి దాహము కల్గు
సాధనానుభూతి శరణు శర్మ!

నిగ్రహమ్ము వలన నిశ్చల బుద్ధి యౌ
నిశ్చలమగు బుద్ధి నిష్ఠ భక్తి
భక్తి వలన శాంతి పర సౌఖ్య మోగాన
సాధనాభూతి శరణు శర్మ!

తెలియకెన్నొ హింస లిల జేయు చుందువు
ప్రొద్దు మాపులందు పూజ సలుపు
తెలిసి సేసి హింస కలుషితుడవు గాకు
సాధనానుభూతి శరణు శర్మ!

సాధనమ్ము లెపుడు సంతరించు మదిని
అనుభవమ్ము కలుగు నంతరాత్మ
సత్యమును నహింస సాధించగలుగును
సాధననానుభూతి శరణు శర్మ!

## వివేక - బుద్ధి

గొప్పదనమె గుణము కొండికవ గుణమ్ము
పేరు కీర్తులకయి పెనుగులాట
పనికి మాలిన పని వెనుకకు నెట్టును
సాధనానుభూతి శరణు శర్మ!

మనుజులెల్లవారు మనకు చుట్టమ్ములె
పగయు లేరు మనకు తగువు లేదు
కోరి తెచ్చుకొనము కోరికల్ కోపాలు
సాధనానుభూతి శరణు శర్మ!

బాల్య యౌవనములు బడలి కౌమారము
ముసలి తనవు చదువు మొదలు రక్తి
సాగియడవి నిల్లు సన్యాసము విరక్తి
సాధనానుభూతి శరణు శర్మ!

శిశుత వృద్ధత పరవశమగు నానంద
మద్ది కాదు చూడ నాటవస్తు
వెడద యనుభవమ్ము చెడినచో చెడుటయే
సాధనానుభూతి శరణు శర్మ!

ఆరు చక్రములను నాధారమును సహ
స్రారమాది చివర నచట జ్యోతి
దిగువనుండి పొమ్ము ఎగువకు నది దీప్తి
సాధనానుభూతి శరణు శర్మ।

నేల నీరు నిప్పుగాలి నీలో నుండె
ఆకసమ్ముతోడ, అదియె నీవు!
నీవు ఇమిడి యుంటి నీ కాక లేమిటి?
సాధనానుభూతి శరణు శర్మ!

అన్నమునకు గాను ఆరాటపడు స్థితి
ఆది నేది? ప్రకృతి అదియె ముదము
స్వానుభూతి యొకడె యాహ్లాదము నొసంగు
సాధనానుభూతి శరణు శర్మ!

ప్రకృతి తిండి బెట్టుపని యజ్ఞ యాగముల్
దున్న నేయ చదువకున్న గడవ
దన్న స్థితికి వచ్చి, దున్నుటె యజ్ఞమై
సాధనానుభూతి శరణు శర్మ!

ఆకు కాయ ఫలము ఆహార మప్పుడు
జాతు లేవి? మనుజ జాతి తప్ప
చేసి కృషిని, మరి కృషీవలు డయితివి
సాధనానుభూతి శరణు శర్మ!

బ్రహ్మచర్య జపము గ్రంథాధ్యయనము
పస్తు, మతములును తపమ్ము నిష్ఠ
అపుడు, నిపుడు చేతలవి చేసుకొన్న వే
సాధనానుభూతి శరణు శర్మ!

చేసినంత వట్టు చేయుదామనిపించు
ముదముస్వానుభూతి భోజనమ్ము
అన్నియు నలవాటులవి నిన్ను విడువవు
సాధనానుభూతి శరణు శర్మ!

నిజము నీతి పలుక నిష్ఠురము లెగతి
తప్పు తెలిసి జనుడు ఒప్పుకొనడు
సత్యమునకు విలువ సజ్జనుడిచ్చును
సాధనానుభూతి శరణు శర్మ!

బంధువులను మనకు భగవంతుడొన గూర్చు
నేస్తములను గూర్చు నేర్పుమనది
జీవయాత్రకు వీరు చేదోడు వాదోడు
సాధనానుభూతి శరణు శర్మ!

బాధలెచట లేవు? బాధలంతట నుండు
మోదమున్నచోట బాధయుండు
బాధ మోదమునకు బాంధవ్య మున్నది
సాధనానుభూతి శరణు శర్మ!

బ్రతుకె స్థిరముకాదు బాధలు స్థిరములా ?
బ్రతుకు, బాధ నీకు, భార్య, భ్రాత,
వెంటనుంచు వాటి నింట బైటను కూడ
సాధనానుభూతి శరణు శర్మ!

ం:——:ం

## ముగింపు

ఏమి పాపమయ్యా! ఇది యంత నెత్తిన
పెట్టి మోయమనెది దెట్టి న్యాయ
మందు వేమొ? హేతువాధార మీవెగా!
సాధనానుభూతి శరణు శర్మ!

మోయగలవు, నెత్తి మోపని పెట్టితి
"అల్లె మోతునయ్యా" అనుట వింటి
పాదు తెలిసె నీదు పలుకుల భావన
సాధనానుభూతి శరణు శర్మ!

కోరి చేయుచుంటి వూరికే ప్రేరణ
నీకు నేను, నాకు నీవు తోడు
కర్మభక్తి జ్ఞాన మర్మమ్ము తెలుఁగుదు
సాధనానుభూతి శరణు శర్మ!

నేను చెప్పినట్లు! నీవు వినిన యట్లు
నీకు తెలియని దేమి నాకు తెలియు
వినుట చెప్పుట లివి మన కలవాటులె!
సాధనానుభూతి శరణు శర్మ!

కబురు లికను కట్టి కర్మచేపడుదుము
మనసుధ్యాన మందు మగ్నమగుచు
వినిన ఓపికకును వేయి వందనములు
సాధనానుభూతి శరణు శర్మ!

# శబ్దార్థములు

## సాధనానుభూతి శరణు శర్మ

సాధనానుభూతి = భగవంతుని చూచుటలో ఆయత్నంలో కలిగిన అనందానుభవము, సత్యమును పరికించు ప్రయత్నంలో కలిగిన హృదయానుభవానందము

శరణు = ఆశ్రయము, రక్షణ

శర్మ = శుభము, పవిత్రము

మేటి = అధిపుడు

సావధాన బుద్ధి = మిక్కిలి ఎచ్చరిక బుద్ధి

సరణి = పద్ధతి

కులపతి = ఋషి, 10,000 శిష్యులు గల బోధకుడగు ఋషి

అనిల = గాలి, వాయువు

అనుభూతి = అనుభవము, అనుభుక్తి, తిండి

అమృతవాణి = సంస్కృతము, అమరభాష

అరుణుడు = సూర్యుడు

అలరె = శోభించె, ఉండె

అవయవములు = చేతులు, కాళ్లు, కళ్లు, చెవులు ముక్కు

అవధానబుద్ధి = తీక్షణ బుద్ధి, ఎచ్చరిక బుద్ధి

అహరహము = పగలు రాత్రి

ఆచరణ = ఆచారము, నడత, వర్తన

ఆటపట్టు = స్థానము, నివాసము

ఆతిథ్యము = అతిథి సత్కారము

ఆది = ఆరంభము, మొదలు

ఆధ్యాత్మికము = ఆత్మవలన కలిగినది

ఆరయ = అరయ, ఆలోచించ-చూడ, గమనించ

అలరు = శోభించు, ఉండు

ఇంగితము = అభిప్రాయము

ఇంపు = సొంపు, అందము, ఆనందము

ఇగురింప = చిగురింప, వృద్ధి పొంద

ఒగి = క్రమముగ, పద్ధతిగ, విధి విధానముగ

కడిగి = యత్నించి

కడలి = సముద్రం

కరణము = వ్రాయువాడు, వ్రాతగాడు, పనిముట్టు

కరుదు = ప్రవచనము, హితానుభవ హితవు, బోధ

కామ-వేదన = కోరిక యను బాధ

కృతి = రచన, ప్రబంధము, ఛందస్సు, చదువరి, నేర్పరి, చేయుట, ఒప్పించుట

కృతులు = చేతలు, పనులు, వృత్తులు

కొండిక = చిన్నది, కొంచెపు

కౌమారము = బాల్యమునకు ఆవలివయో అవస్థ

గమ్మ = గంధ, వాసన, వాసన కొట్టుటయందు అనుకరణ

గోష్ఠి = సల్లాపము

ఘ్రాణ = శ్వాస, ఊపిరి

చయము = సమూహము, సైన్యము, సంగ్రహము

చేటు = కీడు, చెడ్డ

చక్షు = కన్ను

చేర్వనే = చేరువనే, చోటనే, దగ్గరనే

జ్ఞేయము = తెలిసికోదగిన

ఝరి = సెలయేరు

డెందము = హృదయము, గుండె

తగవు = న్యాయము, యుక్తము, తగుట

తగువు = కలహము

తత్త్వము = జ్ఞానము = పరమాత్మ, వాడేనీవు

తమము = చీకటి తమోహారి = అజ్ఞానమును హరించును

తన్మయత్వము = తనను తాను మరచి యుండుట, శరీర విస్మృతి

తల్లిబాస = తెలుగుభాష

త్వక్కు = శరీరము

తావి = వాసన, గంధము

త్రాణ = బలము, శక్తి

తెగువ = సాహసము

తొడి = తొడు, తొడుగు, భూషణము

తోడి వాని బిడ్డ = సాధనానుభూతి కృతి

దమము = సహనము, ఇంద్రియ నిగ్రహము, క్లేశము నణచుట

దార్శనికము = దర్శన శాస్త్రము, వేదాంతము, ఆధ్యాత్మికము

దీప్తి = కాంతి, వెలుతురు

దుహిత = కూతురు

దేవభాష = సంస్కృతము

దేశభాష = హిందీ

ధాటి = దాడి, దండయాత్ర

ధుర్యుడు = భారము వహించు వాడు

నమ్రత = వినయము

నలినము = తామర ము

నాకమరిగె = స్వర్గమేగె, మరణించె

నిగ్రహము = చెఱ, మేర, త్రోపాట

నెయ్యము = స్నేహము

పండిత కవి భాస = పాండిత్యమున కవిత్వమున భాసకవివి

పరము = స్వర్గము, దేవలోకము

పరికించు = పరీక్షించు

పరుడు = పరమాత్మ, కర్త

పవనుడు = గాలి, వాయువు- వాతూలము, మరుత్

పాటి = ప్రయాణము, సామ్యము

పాణి = చేయి, కరము, హస్తము

పాయు = వాయువు

పారలౌకిక గతి = పరలోక మార్గము

పారవశ్యము = తల్లీనము--తన్మయము

ప్రథ = కీర్తి, ప్రఖ్యాత, యశము, వాసి, పేరు ప్రతిష్ట

ప్రలయము = విలయము, నాశము

ప్రాతః = ప్రొద్దున, ప్రథమ ప్రేరణ

పూనింప = పూరింప, పూనుకొన, యత్నింప, ఉద్యమింప

పెన్నిధి = పెద్ద పాతఅ

పైడి = బంగారము, కనకము, పసిడి

పైడికి తావి = బంగారమునకు వాసన [అబ్బినట్లు]

బడలి = అలసి, సొలసి, శ్రమించి

బాధబుద్ధియువృత్తి = బుద్ధిసహజ [వృత్తి] ప్రవర్తన

భద్ర = శ్రేష్ఠ, భద్రపురుషుడు, పురుష జాతి విశేషము

భాగవతుడు = భక్తుడు

భూతి = ఐశ్వర్యము

మగ్నము = మునిగినది, లీనమైనది

మధువు = వసంతఋతువు, చైత్ర వైశాఖ మాసములు

మననము = అధ్యయనము, చింతనము, గమనము

మనుగడ = బ్రతుకు, బ్రతుకు తెరవు

మర్మము = రహస్యము

మహతి = గొప్పది, వీణ, 100 తంతులు

మూల్యము = విలువ, వెల

మేటి = అధిపుడు

మై = తమవు, శరీరము

మ్రోల = ఎదుట

రవము = ధ్వని, కంఠ ధ్వని

రసన = నాలుక, జిహ్వా

రాగాది = అనురాగము మొదలైనవి. ప్రేమ, మత్సరము

లేమి = పేదరికము

వట పత్రము = మఱ్ఱి ఆకు

వర్ర = కారము

వాణి = వాక్కు, మాట సరస్వతి

వానప్రస్థము = ఆశ్రమము మూడవది

విధి = కాలము, కర్తవ్యము, చేయుట, బ్రహ్మ

విహృతి = విహారము

వృత్తి = నడక, నడవడి

వేదన = బాధ

వెస = వేగము, చురుకైన

శతము = నూరు 100 వంద

శమము = శాంతి, కామక్రోధాది రహితము

శిఖరము = శిరము, ప్రధానము, సేనాగ్రము

శివము = శుభము, సుఖము, మోక్షము, వేదము

శూలదృష్టి = క్రోధ దృష్టి

శ్రుతము = వినికి, శాస్త్రము, చెవి, వినబడినది

సంజ = సంధ్య, సాయంత్రము

సంతరించు = కూడబెట్టు, కూర్చు, సంగ్రహించు, సంపాదించు

సంస్కృతి = సరిచేయబడిన

సడికట్టు = జాడకనిపించు

సత్తు చిత్తు = సత్యము జ్ఞానము

సనాతన విధి = పూర్వకాలపు ఏర్పాటు

సరణి = పద్ధతి

సవరించు = వహించు, ధరించు, తాల్చు

స్రష్ట = సృష్టికర్త, విధి, బ్రహ్మ

సాధనము = పనిముట్టు, ఉపకరణము, కొరముట్టు

సాధనానుభూతి = భగవంతుని చూచు ప్రయత్నంలో
కలిగిన అనుభవానందము

సావధాన బుద్ధి = మిక్కిలి ఎచ్చరిక బుద్ధి

స్వాంతము = మనస్సు, గుహ

స్వాంతగమ్మ్మ = మనస్సు గంధము

స్వాస్థ్యము = ఆరోగ్యము

హృషితరవము = హృదయ సంబంధి ధ్వని

# సాధనానుభూతి శరణు పుత్ర శబ్దార్థములు

సాధనానుభూతి- శరణు = సత్యమునుపరికించు సత్ప్రయత్నములో కలుగు అనుభవానందమే ఆశ్రయ రక్షణము. శర్మ = శుభము, పవిత్రము, మెలగు, మసలు = ప్రవర్తించుము లీనస్థితి = కలసిపోయిన స్థితిలయ స్థితి; రక్తి = ప్రేమ, సక్తి = ఆశ, కోరిక, శౌచవిధి = మలవిసర్జనం, నాశికము = ముక్కు అనిల = గాలి, నియతి = నియమం, నిష్ఠ = ఉనికి, ఊను = వహించు, సత్వరజోతమో గుణములు = ఉత్తమమధ్యమఅధమము దీప్తి = జ్యోతి, పెన్నిధి = పెద్ద పాతర, దుహిత = కూతురు, వెస = శీఘ్రు, వేగము, చేర్వ, చేరువ = దగ్గర, శిష్ట, శిష్ఠ = శీలము, మనుట = బ్రతకుట, మనవచ్చునా? = బ్రతుకవచ్చునా? కరుదు = ప్రవచనము, హితవు, అరయుట = చూచుట, పరికించుట, సవధరించు = వహించు, ప్రేరణ = ప్రేరేపణ,పురికొల్పు, ఉత్సాహ పెట్టు, వేదన = నొప్పి, తెలివి హృపిత, రవమె = హృదయము సంబంధిధ్వని, శూలదృష్టి = క్రోధ దృష్టి, పైడికి తావి = బంగారమునకు వాసన, గమ్మ = గంధ,వాసన, గోష్టి = సల్లాపము ఇంపు - సొంపు = అందము-చందము, ఒగి = క్రమముగ, విధి విదానముగ పద్దతిగ, కడలి = సముద్రము, కలుషితుడవు = పాపివి, మురికి వాడవు. వివేక-బుద్ధి = ఆలోచనాత్మక బుద్ధి, వివేచనా-బుద్ధి, కొండిక = చిన్నది, కొంచెపు పెనుగులాట = కుమ్ములాట, వెడద = విశాలము, పాదు = కుదురు, ఆలవాలము, క్రింధు, నిలుకడ.

32

ముద్రణ

దక్షిణ భారత హిందీ ప్రచార సభ - ఆంధ్ర

ఖైరతాబాదు, హైదరాబాదు-500 004.

B CÍ

AOUA 103B 135
V. R. NARLA MEMORIAL LIBRARY V.R.NARLA D.P.R.I. Acc. No.

# రచయిత - రచనలు

## ముద్రితములు

పుత్రీ శతము - కృతి సమర్పణ -
శ్రీ తులసీదేవి, M. V. ప్రసాదరావు ఆలూరికి

సుభాషిశసులు - కృతి సమర్పణ -
శ్రీ తులసీదేవి. M. V. ప్రసాదరావు ఆలూరికి

సాధనానుభూతి శతద్వయం - పుత్ర శతము - శరణు శతము -
కృతి సమర్పణ - శ్రీ విశ్వనాథ సత్యనారాయణకు

## అముద్రితములు

నా జీవితగాథ - గద్య శర్మ సుభాషితాలు - కృతిపతి -
శ్రీ నార్ల వెంకటేశ్వరరావు

మాటా-మంచి - కృతిపతి - శ్రీ దివాకర్ల వేంకటావధాని

ఆణి ముత్యములు - కృతి సమర్పణ -
రచయిత తల్లి శ్రీ నరసమాంబకు

సంఘ-సంస్కృతి - కృతి సమర్పణ - రచయిత తండ్రి శ్రీ అమ్మనకు

మానవుడు - కృతిపతి - శ్రీ బి వేంకటరావు. పకృతి ఆశ్రమం.
బేగంపేట

కాలరీతి - కృతిపతి - డాక్టరు శ్రీ దాశరథి, రాష్ట్ర ఆస్థానకవి.

ముద్రణ : దక్షిణ భారత ప్రెస్, ఖైరతాబాదు, హైదరాబాదు - 500 004.

### మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AGUA1103B135 |
| పుస్తకం పేరు | సాధన/ [illegible] |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | NO |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 39 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | CBCI |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Bhargavi |
| పేజీలు విడదీసినది | [illegible] |
| స్కాన్ చేసినది | C.Naga [illegible] |
| పరీక్ష చేసినది | SARANYA |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |